సాక్షి నిర్మల్
గురువారం । 16 । మార్చి । 2023



ఏజెన్సీ వైద్యానికి కొత్త రూపు

ఏజెన్సీ వైద్యానికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కొత్త రూపు తీసుకువస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. 8లో▸



ప్రమాదకరంగా వంతెనలు

సారంగపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా రక్షణ గోడలు లేక రోడ్డు కోతకు గురైంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

- జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్



మామడలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ధన్‌రాజ్

మామడ: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. దగ్గరి చూపు సమస్య ఉన్నవారికి వెంటనే కళ్లద్దాలు అందిస్తామని తెలిపారు. దూరపు చూపు సమస్య ఉన్నవారికి ఆర్డర్‌పై కళ్లద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు అరుణ్, శ్రీకాంత్, సీహెచ్‌వో లస్మన్న, సూపర్‌వైజర్ కన్నయ్య ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

కుంటాల: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీలత సూచించారు. బుధవారం మండలంలోని అంబకంటి తండాలో నర్సరీ, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంప్‌యార్డుకు తరలించాలని సూచించారు. వేసవి దృష్ట్యా నర్సరీలో మొక్కలు వాడిపోకుండా నీళ్లు పట్టాలని తెలిపారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీవో రహీం, సర్పంచ్ జాదవ్‌శంకర్, ఎంపీటీసీ సుధాకర్, కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

వైద్యపోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయ పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిలో బస్తీ దవాఖానాల్లో పనిచేసేందుకు ముగ్గురు ఎంబీబీఎస్‌లు, మానసిక ఆరోగ్య కార్యక్రమంలో పని చేసేందుకు ఒక సైక్రియాటిస్ట్ నియామకానికి ఈ నెల 20న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్మల్ వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో నేరుగా ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.


జోరుగా 'అల్ఫోర్స్' గ్లోరియస్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో గ్లోరియస్ పేరిట పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో నిర్మల్, భైంసా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ.నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి రాబోయే పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ



రేషన్‌దుకాణాన్ని తనిఖీ చేస్తున్న రాంబాబు

దిలావర్‌పూర్: న్యూలోలం గ్రామ రేషన్‌దుకాణాన్ని బుధవారం అదనపు కలెక్టర్ రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలకు సకాలంలో సరుకులు అందజేయాలని డీలర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ కరీం, ఆర్‌ఐ సంతోష్ ఉన్నారు.

గాడిన పడేనా?



జిల్లాకేంద్రంలోని సోఫినగర్‌లో జాతీయరహదారి పక్కనే గల మార్క్‌ఫెడ్ స్థలం

- అప్పుల్లో ఉన్న మార్క్‌ఫెడ్..!
- ఇన్నాళ్లు కొనుగోళ్లకే పరిమితం
- ఇక విక్రయాల వైపు పయనం
- లాభాల బాట పట్టించే యత్నం
- జిల్లాలో వాణిజ్య సముదాయం
- నిర్మల్‌లో సంస్థకు విలువైన స్థలం

నిర్మల్: మార్క్‌ఫెడ్ (తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్) అంటే.. జిల్లాలో శనగ, మక్కల కొనుగోళ్లు, యూరియా నిల్వలు గుర్తుకు వస్తాయి. ఈ సంస్థ సహకార సంఘాలైన పీఏసీఎస్, డీసీఎంఎస్, ఏఎంసీలు, స్వయం సహాయక సంఘాల గ్రామ సంస్థల నెట్‌వర్క్ ద్వారా రైతులకు సేవ చేసే కార్యకలాపాలు చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఏజెంట్‌గా మద్దతు ధర కార్యకలాపాలు చూడడానికి, రైతులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధర అందించడానికి కృషిచేస్తోంది. మార్కెట్‌కు ఎరువుల సేకరణ, బఫర్ నిల్వల నిర్వహణ, పంపిణీ కోసం మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా నామినేట్ చేయబడిన సంస్థ. ఇలాంటి సంస్థ గత కొన్నేళ్లుగా అప్పుల్లో కూరుకుపోయినట్లు ప్రచారం ఉంది. దీన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సర్కారు ప్రయత్నం చేస్తోంది. మార్క్‌ఫెడ్ నిత్యావసరాల మార్కెట్‌లోకి అడుగు పెట్టే దిశగా ఆలోచిస్తోంది. ఇందులో నిర్మల్ జిల్లాను కూడా భాగస్వామ్యం చేసే ప్రణాళికలు వేస్తోంది.

పలు ప్రతిపాదనలు

వివిధ కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మార్క్‌ఫెడ్‌ను లాభాల బాట పట్టించేందుకు రాష్ట్రస్థాయిలో సూత్రప్రాయంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో బియ్యం, వంటనూనెలు, డ్రైఫ్రూట్స్, పప్పులు, గోధుమపిండి, పాలఉత్పత్తులతో పాటు నిత్యావసరాలను బల్క్‌గా ప్రభుత్వ శాఖలకు అందించాలని చర్చిస్తున్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, సంక్షేమశాఖలు, జైళ్లు తదితర శాఖలకు టెండర్ల ద్వారా సరఫరా చేయాలని యోచిస్తున్నారు. అలాగే పప్పు, పసుపు, శుద్ధి ప్లాంట్లు, పురుగు మందులు ఇతర వ్యవసాయ ఇన్‌పుట్‌లు, వర్మీకంపోస్టులను విక్రయించేలా ప్రతిపాదనల్లో చర్చించారు. కొనుగోలు చేసిన పసుపు, మిర్చి పౌడర్‌ను వినియోగదారులకు అందించడం, మిల్లెట్ల మార్కెటింగ్ తదితర పనులపై చర్చలు నడుస్తున్నాయి.

నిర్మల్‌లో ఎందుకంటే..

మార్క్‌ఫెడ్ కార్యక్రమాల విస్తరణకు ముందుగా పలు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుంది. ఇందులో ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి, నిర్మల్ జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో జిల్లాలు ఉన్నా.. నిర్మల్‌ను ఎంపిక చేయడం వెనుక కారణమూ ఉంది. ప్రధానంగా జిల్లాకేంద్రంలోని సోఫినగర్‌లో జాతీయ రహదారి పక్కనే మార్క్‌ఫెడ్‌కు రూ.కోట్ల విలువైన స్థలం ఉంది. ప్రస్తుతం అందులో ఒక గోడౌన్ కూడా ఉంది. ఇలాంటి స్థలాలు ఉన్నచోటే ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. నిర్మల్‌లోని స్థలంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో వాణిజ్య సముదాయాల నిర్మాణం, మరో 20వేల మెట్రిక్ టన్నుల గోదాము నిర్మాణం, రైస్ ఫోర్టిఫికేషన్ ప్రాజెక్ట్, తాగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా అంగీకరించారు.

ఆదేశాలు అందగానే..

మార్క్‌ఫెడ్ ద్వారా నిత్యావసరాల విక్రయాలు చేపట్టాలనే విషయం పైస్థాయిలో చర్చకొచ్చింది. ప్రస్తుతం వీటి ఏర్పాటుపై జిల్లాలకు ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఇక్కడ పనులు చేపడతాం.

– గౌరీనాగేశ్వరరావు, డీఎం, మార్క్‌ఫెడ్

సబార్డినేట్ పోస్టుకు ముడుపులు..!

- అంగన్‌వాడీల పాత్రపై అనుమానం
- సీడీపీవోకు తెలియకుండానే తతంగం
- భైంసాలోని ఐసీడీఎస్‌లో నిర్వాకం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



భైంసాటౌన్: భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ (అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన) పోస్టును ఒకరికి కట్టబెట్టేందుకు కొందరు అంగన్‌వాడీ టీచర్లు అత్యుత్సాహం చూపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏకంగా సీడీపీవోకు తెలియకుండానే ఓ ప్రజాప్రతినిధి వద్ద లాబీయింగ్ జరిపి తమకు అనుకూలంగా ఓ మహిళకు సబార్డినేట్ పోస్టు కట్టబెట్టేందుకు యత్నించినట్లు తెలిసింది. ఈ మేరకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచి ఆర్డర్ కాపీ రాగా, తనను విధుల్లోకి చేర్చుకోవాలంటూ సదరు మహిళ కార్యాలయానికి రావడంతో సీడీపీవో అవాక్కయ్యారు. అయి తే, ఇదివరకు తాత్కాలికంగా పనిచేస్తున్న మహిళ తనను కాదని మరొకరికి పోస్టు ఎలా ఇచ్చారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది.

అసలేం జరిగిందంటే..

భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఓ మహిళ కొన్నేళ్లుగా సబార్డినేట్ (అప్పటికి పోస్టు మంజూరు కాలేదు)గా పనిచేస్తోంది. కాగా, ఇటీవల భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టు మంజూరు కావడంతో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసుకునేందుకు అనుమతి వచ్చింది. దీంతో ఇదివరకు పనిచేస్తున్న మహిళనే ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో నియమించాలని సీడీపీవో ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. కాగా, ప్రాజెక్టుకు కొత్తగా ఆఫీస్ సబార్డినేట్ పోస్టు మంజూరైన విషయం తెలుసుకున్న కొందరు అంగన్‌వాడీ టీచర్లు సదరు మహిళను కాదని మరో మహిళకు పోస్టు కట్టబెట్టేందుకు యత్నించినట్లు తెలిసింది. ఈ మేరకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధిని సంప్రదించి, ఆమెకు పోస్టు కేటాయించాలంటూ సిఫారసు చేసినట్లు సమాచారం. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా ఆ సిఫారసు ఆధారంగా ఆమె పేరుతో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచి ఆర్డర్ కాపీ అందించారు. దీంతో నెల కిందట తనను విధుల్లోకి చేర్చుకోవాలంటూ సదరు మహిళ కార్యాలయానికి రాగా, తను ప్రతిపాదించకుండా సదరు మహిళకు ఆర్డర్ కాపీ ఎలా ఇచ్చారంటూ సీడీపీవో ఉన్నతాధికారులను సంప్రదించారు. భైంసాకు చెందిన కొందరు అంగన్‌వాడీ టీచర్లు, శాఖ జిల్లా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి సీడీపీవోకు తెలియకుండానే మరో మహిళకు ఆర్డర్ కాపీ వచ్చేలా చక్రం తిప్పినట్లు తెలిసింది. దీంతో ఇదివరకు పనిచేస్తున్న మహిళ నిబంధనల ప్రకారం పోస్టు తనకే కేటాయించాలంటూ ఉన్నతాధికారులను సంప్రదించినట్లు సమాచారం. ఈ తతంగంలో భైంసాకు చెందిన కొందరు అంగన్‌వాడీ టీచర్లు, జిల్లా శాఖలోని ఓ ఉద్యోగి సదరు మహిళ నుంచి ముడుపులు తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపడితే నిజాలు బయటికి వచ్చే అవకాశముంది.

నా ప్రమేయం లేకుండానే..

ఇటీవల భైంసా ప్రాజెక్టుకు ఆఫీస్ సబార్డినేట్ పోస్టు మంజూరైంది. దీంతో ముందు నుంచే పనిచేస్తున్న మహిళకు నిబంధనల ప్రకారం పోస్టు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అయితే, ఆమెను కాకుండా మరో మహిళకు ఆర్డరు కాపీ ఎలా వచ్చిందో తెలియదు. నా ప్రమేయం లేకుండా ఇది జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– నాగలక్ష్మి, సీడీపీవో, భైంసా

తప్పుదోవ పట్టించారు

భైంసా ప్రాజెక్టులో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు నిబంధనల ప్రకారం ఇదివరకు పనిచేసిన మహిళకే చెందుతుంది. కానీ, కొందరు అధికారులను తప్పుదోవ పట్టించి, మరో మహిళ పేరు ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్డర్ కాపీ వెనక్కి తీసుకుంటాం. నిబంధనల మేరకు అర్హులైన వారికే పోస్టు కేటాయిస్తాం.

– విజయలక్ష్మి, డీడబ్ల్యూవో

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షకు రెడీ అంటున్న విద్యార్థినులు

నిర్మల్ రూరల్: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొదటిరోజు ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించగా 7,553 మందికి 6,895మంది హాజరయ్యారు. 658 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 6,276 మందికి 5,912 మంది హాజరు కాగా, 364 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1,277 మందికి 983 మంది హాజరు కాగా, 294 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి బాలుర, బాలికల జూనియర్ కళాశాలలోని కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని ఆలస్యంగా పరీక్షకు హాజరు కాగా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో ఆమె నిరాశతో వెనుదిరిగింది.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



పరీక్షించి లోనికి పంపుతున్న సిబ్బంది



నిమిషం నిబంధనతో నిరాశతో వెనుదిరిగిన విద్యార్థిని

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నర్సాపూర్(జీ): గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ మిషన్ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే గ్రామం అభివృద్ధి బాటలో సాగుతుందని చెప్పారు. మండలంలోని 13 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను అడిగి ఇప్పటివరకు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనుల వివరాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో వచ్చే హరితహారం నాటికి మొక్కలు ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఇంటి పన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీలో తడి, పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువు తయారుచేసి రైతులకు విక్రయించాలని చెప్పారు. వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖర్చులకు వినియోగించాలని సూచించారు. ప్రతీ గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాలను నిరంతరం ఎంపీడీవోలు, ఎంపీవోలు పరిశీలించాలని ఆదేశించారు. చాక్‌పల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తయారు చేసిన ఎరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. అనంతరం స్థానిక కేజీబీవీ, రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల వసతి, భోజనం గురించి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం సజావుగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీడీవో వనజ, సీడీపీవో నాగమణి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

పనులు సద్వినియోగం చేసుకోవాలి



పొట్టపెల్లిలో పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామంలో ఉపాధిహామీ కింద చేపట్టిన మినీ చెరువు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో కాసేపు మాట్లాడారు. ఉపాధిహామీ సిబ్బంది సూచించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. మినీ చెరువు నిర్మాణంతో గ్రామంలోని పశువుల తాగునీటికి ఇబ్బంది తొలగిపోతుందన్నారు. ఉపాధిహామీ పనికి 200 మంది కూలీలు రావడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెంచేందుకు సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పని ప్రదేశం వద్ద కూలీలకు పూర్తి వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీడీ ప్రసాద్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, గంగప్రసాద్, ఏపీవో ప్రేమల, టీఏ దినేశ్, నారాయణ, ఎఫ్‌ఏ శ్రీనివాస్, సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీడీసీ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో ప్రత్యేక పూజలు



భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీనెల అమ్మవారి జన్మనక్షత్రం, మూలనక్షత్రం పూజలో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష అభిషేకం, కలశ పూజ, గణపతి పూజ, సరస్వతీ కుంకుమార్చన పూజలు జరిపించారు.

ఈవీఎం గోదాముల భద్రతలో అశ్రద్ధ వద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ఈవీఎం గోదాముల భద్రతలో అశ్రద్ధ తగదని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ రాంబాబుతో కలి సి తనిఖీ చేశారు. ముందుగా తాళం వేసి ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. సీసీ కెమెరా పనితీరును గమనించారు. రికార్డులు తనిఖీ చేసి రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరా పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈసీఐఎల్ ఆదేశాల మేరకు పాత స్టాక్ 600 బస్ బ్యాలెట్లను పంజాబ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల నాయకులున్నారు.

సకాలంలో సరుకులు అందజేయాలి

చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్, గొల్లపేట్‌లోని చౌకధరల దుకాణాలు, చించోలి (బీ)లోగల ఎంఎల్‌ఎస్ మండల స్థాయి గిడ్డంగులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సకాలంలో.. సక్రమంగా రేషన్ అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. రేషన్‌దుకాణాల్లో స్టాక్ తెలిపే బోర్డులు, బయోమెట్రిక్ ఈపాస్ యంత్రాలు, రిజిస్ట్రేషన్ ప్రకారం ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్ ఉన్నాయో.. లేదో తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, మేనేజర్ శ్రీకల, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ, పక్కన డీఎస్పీ

నిర్మల్‌టౌన్: ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలో బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మెడికల్ క్యాంపును ప్రారంభించి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్తీ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి వైద్యుడిని సంప్రదించి హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 185 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమంపై ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. వైద్యనిపుణులు మనోజ్‌కుమార్, సాయినాథ్, నారాయణరావు, సుజల వైద్య పరీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీ (ఏఆర్) వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ సీసీ వెంకటరమణ, సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఐ రామకృష్ణ, ఎంటీవో వినోద్, ఆర్‌ఎస్‌ఐ రవికుమార్, పోలీస్ సంఘం అధ్యక్షుడు విరాసత్ అలీ, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



డీటీ మంజులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెంబి: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1, విద్యుత్ శాఖ ఏఈ ఉద్యోగాలకు నిర్వహించిన పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన టీఎస్‌పీఎస్సీ సిబ్బందిని కఠినంగా శిక్షించాలని పెంబి మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో పరీక్షలు రద్దు చేయాలని, లీక్ చేసిన టీఎస్‌పీఎస్సీ సిబ్బందిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు వసంత్‌రావు, రాజునాయక్ ఉన్నారు.

రంజాన్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ ఏర్పాట్లపై ముస్లిం పెద్దలు, ఆయా శాఖల అధికారులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల వద్ద పరిశుభ్రత ఉండేలా శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, వీధి దీపాలు, మసీదుల వద్ద లైటింగ్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎస్పీని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులుంటే పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో లోకేశ్, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ సుభాష్‌చందర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీ వైద్యానికి కొత్త రూపు



ఉట్నూర్: ఏజెన్సీ వైద్యానికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కొత్తరూపు తీసుకువస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేలా ముందుకు సాగుతోంది. ఏజెన్సీ వ్యాప్తంగా 31 పీహెచ్‌సీలున్నాయి. వీటిలో సౌకర్యాల కల్పన ఆధారంగా జననీ నిరీక్షణ, బాలింత సంరక్షణ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ హబ్ తదితర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఉట్నూర్ కేంద్రంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకలతో జిల్లా ఆసుపత్రిగా మార్చింది. అంతేకాకుండా డయాలసిస్, ఐసీయూ, రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేసి గిరిపుత్రులకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది.



- గర్భిణులకు అండగా 'జననీ నిరీక్షణ'
- 'బాలింత సంరక్షణ'కు పెద్దపీట
- అందుబాటులోకి డయాగ్నోస్టిక్ హబ్
- 'ఎన్‌క్వాస్'తో మెరుగవుతున్న వైద్యసేవలు
- 'గిరి' ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై ఐటీడీఏ దృష్టి

బాలింత సంరక్షణ కేంద్రంగా కొనసాగుతున్న కెరమెరి పీహెచ్‌సీ

జననీ నిరీక్షణ కేంద్రాలు..

ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతుండేవారు. వర్షాకాలంలో సరైన రవాణా సౌకర్యం లేక సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2015లో జననీ నిరీక్షణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలుత ఉట్నూర్, ఆసిఫాబాద్, జైనూర్ సీహెచ్‌సీలతో పాటు మంచిర్యాల ఏరియా ఆసుపత్రిలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక్కడ సత్ఫలితాలు ఇవ్వడంతో కొత్తగా నార్నూర్, గాదిగూడ, ఝరి, గుడిహత్నూర్, ఇచ్చోడ, భీంపూర్, వాంకిడి, రోంపల్లి, గిన్నెధరి, కౌటాల, బెజ్జూర్ పీహెచ్‌సీల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గర్భిణులను వారి ఆరోగ్యస్థితి మేరకు ప్రసవ సమయానికి మూడు నుంచి ఐదు రోజుల ముందే ఈ కేంద్రాలకు తరలిస్తారు. డెలివరీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వైద్య సేవలు అందిస్తారు.



జననీ నిరీక్షణ కేంద్రం ఏర్పాటుకు ఎంపికైన గాదిగూడ పీహెచ్‌సీ

బాలింత సంరక్షణ కేంద్రాలు..

ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళలు, బాలింతలు ఎక్కువగా రక్తహీనత, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు. ఈ క్రమంలో వీరి మరణాలు తగ్గించేలా ఐటీడీఏ ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కెరమెరి, వాంకిడి పీహెచ్‌సీల్లో అందుబాటులోకి తెచ్చింది. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, గాదిగూడ, ఝరి, తిర్యాణి, సిర్పూర్–యు పీహెచ్‌సీల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సర్కారు నుంచి ఆమోదం రాగానే ఏర్పాటు చేయనున్నారు. గర్భిణి ప్రసవం అనంతరం ఆరోగ్య స్థితి మేరకు ఈ సంరక్షణ కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం అందించనున్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



ఏజెన్సీలోని గిరిజనుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ సౌకర్యాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి.

– బాలు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి ఉట్నూర్

గిరిజనం చెంతకు వైద్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 మండలాల్లో ఏజెన్సీ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో 4,95,794 మంది గిరిజనులు నివసిస్తుండగా వీరికి ఉట్నూర్, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 31 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ఐటీడీఏ వైద్య సేవలు అందిస్తోంది. అలాగే 23 మండలాల్లో 2014 నుంచి 18 అవ్వాల్ అంబులెన్స్‌ల ద్వారా సేవలందిస్తోంది. ఇప్పటికే 1589 మంది సికిల్‌సెల్, తలసేమియా వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించి సేవలు అందిస్తోంది. అంతేకాకుండా ఉట్నూర్ కేంద్రంగా డయాలసిస్, ఐసీయూ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దోమ తెరలు పంపిణీ చేస్తూ కళాజాత బృందాల ద్వారా నిత్యం ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాధులపై అవగాహన కల్పించేలా ప్రదర్శనలు నిర్వహిస్తోంది.

వైద్య సిబ్బందికి వసతుల కల్పన..

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో నివాస సముదాయాలు నిర్మిస్తోంది. ఇప్పటికే గాదిగూడ పీహెచ్‌సీలో ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయగా పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే ఇచ్చోడ, భీంపూర్–టి, ఝరి, ఇంద్రవెల్లి, కెరమెరి, తిర్యాణి, గిన్నెధరి, రోంపల్లి, లింగాపూర్, సిర్పూర్–యు, లోనువెల్లి పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందికి నివాస సముదాయాలు నిర్మిస్తోంది. ఇందు కోసం రూ.6 కోట్లు విడుదల చేసింది.

'ఎన్‌క్వాస్' తో మెరుగు కానున్న సేవలు



ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన పీహెచ్‌సీ

ఏటా జాతీయ వైద్య ఆరోగ్యశాఖ దేశ వ్యాప్తంగా మెరుగైన వైద్యసేవలు అందించే పీహెచ్‌సీలను గుర్తించి ఎన్‌క్వాస్ గుర్తింపు ఇస్తుంది. ఈ గుర్తింపు లభించిన పీహెచ్‌సీలకు మూడేళ్ల పాటు ఏటా జాతీయ వైద్య ఆరోగ్యశాఖ రూ.3 లక్షల చొప్పున అదనపు నిధులు అందిస్తోంది. ఇలా వచ్చే నిధులతో ఎంపికైన పీహెచ్‌సీల పరిధిలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, భీంపూర్–టి, గాదిగూడ, సిర్పూర్–యు, రోంపల్లి పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. అలాగే అంకోలి పీహెచ్‌సీకి కూడా త్వరలోనే రానుంది.

ఏజెన్సీ కేంద్రంగా డయాగ్నోస్టిక్ హబ్..



ఏజెన్సీ కేంద్రంగా ఏర్పాటు కానున్న డయాగ్నోస్టిక్ హబ్

ఏజెన్సీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఉట్నూర్‌లో రూ.97 లక్షల వ్యయంతో డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో 57 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈమేరకు అవసరమైన చికిత్స అందజేస్తారు. మొదటి దశలో ఉట్నూర్ సబ్‌డివిజన్‌లోని శ్యాంపూర్, హస్నాపూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, నార్నూర్, గాదిగూడ, ఝరి పీహెచ్‌సీలను అనుసంధానం చేయనున్నారు. రానున్న రోజుల్లో మిగతా పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తారు.

క్లుప్తంగా

దాడి చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడి చేసిన ఘటనలో ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ కాలనీకి చెందిన జావిద్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన సద్దాం ఉల్లాఖాన్, ఆయన తల్లి రుక్సాన బేగంలపై జావిద్‌ఖాన్ బుధవారం దాడికి దిగినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న నంది రామయ్య

ఉట్నూర్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. బ్యాంకుల ద్వారా పంటల సాగు కోసం వడ్డీ లేని రుణాలు అందించాలన్నారు. సమావేశంలో నాయకులు జగన్ సింగ్, బాదేరావ్, గణేశ్, విజయ్, మారుతి రావు, సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇంటర్ విద్యార్థికి గాయాలు

నార్నూర్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయడానికి బైక్‌పై వెళ్తున్న విద్యార్థి మెస్రం నితిన్‌కు కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక సర్పంచ్ మెస్రం దేవురావు, జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకులు తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండలంలోని కట్టగూడ గ్రామానికి చెందిన మెస్రం నితిన్ ఉట్నూర్ ఏఆర్‌ఎస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం పరీక్ష రాసేందుకు బైక్‌పై ఉట్నూర్ వెళ్తుండగా ఝరి గ్రామం వద్ద ఉపాధ్యాయుడి కారు ఢీకొట్టింది. స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

అబాకస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ మంచిరాల నాగభూషణం పేర్కొన్నారు. కేఎం యశ్వంత్, మోక్షిత్ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. బుధవారం వీరిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, అబాకస్ టీచర్లు వికాస్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



దాబా యజమానులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఇచ్చోడ: దాబా యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ మండలాల దాబా హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ రాహదారుల పక్కనే ఉన్న దాబాల్లో మద్యం విక్రయాలు చేయవద్దన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వారిని పనిలో పెట్టుకోవద్దని సూచించారు. చుట్టూ సీసీకెమెరాలు పెట్టుకోవాలన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చోడ, నేరడిగొండ మండలాల పరిధిలోని దాబా హోటళ్ల వద్ద నుంచే లారీలు, కంటైనర్‌లు చోరీకి గురవుతున్నాయన్నారు. నేరడిగొండ మండల పరిధిలో జాతీహరహదారిపై ప్రతీ ఏడాది 150 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా క్రైం రేట్ నేరడిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే నమోదవుతుందన్నారు. సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ ముదవత్ నైలు, ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ ఎస్సైలు శ్రీకాంత్, ప్రవీణ్, నీరేశ్ పాల్గొన్నారు.

వాచ్‌మన్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, పక్కన సీఐ శ్రీను

భైంసాటౌన్: ఇటీవల భైంసాలోని భోకర్‌రోడ్డులోగల ఓ జిన్నింగ్ మిల్లు గోదాంలో పనిచేస్తున్న వాచ్‌మన్ షేక్ అహ్మద్ హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం భైంసాలో విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన కూలీలు రాంప్రీత్ సదా, భైరవ్ సదా, బిట్టు సదా, పంకజ్ సదా, శ్యాంయాదవ్, సుబోధ్ సదా, మంతూన్ సదా భైంసాలోని భోకర్‌రోడ్డులోగల జిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నారు. ఈనెల 8న రాత్రి వాచ్‌మన్ షేక్‌అహ్మద్‌తో గొడవ పడగా అది ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో షేక్‌అహ్మద్‌ను భవనం పైనుంచి కిందికి తోయడంతో అతడు మృతిచెందాడు. దీంతో భయపడిన వీరు మృతదేహాన్ని కొంతదూరం ఈడ్చుకెళ్లి గడ్డిపొదల్లో దాచారు. అనంతరం రాత్రే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలించినట్లు ఏఎస్పీ తెలిపారు. బీహార్‌లోని మచ్చార గ్రామంలో ఏ–1 రాంప్రీత్ సదా, ఏ–2 భైరవ్ సదా, ఏ–3 బిట్టు సదా, ఏ–4 పంకజ్ సదాను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మిగతా నలుగురి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. సీఐ ఎల్.శ్రీను, ఎస్సైలు ఉన్నారు.

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామానికి చెందిన జోగ్దండే దిగంబర్ (42) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్దండే దిగంబర్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అప్పులు పెరిగిపోవడంతో మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని పంటపొలంలో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నిరూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

యాసిడ్ తాగి యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బట్టిసావర్‌గాం పంచాయతీ పరిధిలోని నందేశ్వర్ నగర్‌లో అల్వలే స్వాతి (29) అనే యువతి బుధవారం యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇసాక్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తపూర్‌కు చెందిన అల్వలే రాములు కూతురు అల్వలే స్వాతి ఐదు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న నయం కాలేదు. వారం రోజుల కిందట నందేశ్వర్‌నగర్‌లోని అత్తా సువర్ణ ఇంటికి వెళ్లింది. మనస్థాపం చెంది ఉదయం యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్



జేసీబీ గుంత తవ్విస్తున్న అధికారులు

బేల: మండలంలోని కోగ్దూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. దీంతో గ్రామస్తులు ట్రాక్టర్లు పలుమార్లు అడ్డుకున్నారు. బుధవారం జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్, మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎస్సై కృష్ణకుమార్, ఆర్ఐ గీతలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న దారిలో జేసీబీతో గుంతను తవ్వించి, ఆదారిని మూసి వేయించారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ గ్రామంలో బుధవారం చెరువులో పడి లోఖండే బాబారావు(85) వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నార్నూర్ గ్రామానికి చెందిన బాబారావు మంగళవారం వారి కుటుంబసభ్యులకు చెప్పకుండా సిరిచెల్మకు వచ్చాడు. ఆలయం సమీపంలోని చెరువులో మృత దేహం ఉన్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో బుధవారం కోతుల దాడిలో వృద్ధురాలు ఆశమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను కుటుంబీకులు, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్‌లో బుధవారం కోతులు మహిళపై దాడి చేశాయి. పొలిశెట్టి ఎల్లక్క కట్టెలు తీసుకురావడానికి గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లింది. కట్టెలు తీస్తున్న సమయంలో మూడు కోతులు ఒకసారి దాడి చేసి గాయపర్చాయి. ఆమె గట్టిగా అరుస్తూ.. కర్రతో కొట్టడంతో అక్కడి నుంచి పారిపోయాయి. స్థానికులు ఆటోలో శ్యాంపూర్ పీహెచ్‌సీకి తరలించారు.

విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరి రిమాండ్



ఆసిఫాబాద్ జైలులో నిందితులు

తాండూర్(బెల్లంపల్లి): విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ డెప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి తెలిపారు. మండలంలోని కిష్టంపేటకు చెందిన చల్లూరి సంతోష్, నీలయపల్లె వాసి కోయపోశం నీలయపల్లె శివారు అటవీప్రాంతంలో వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్ తీగలు అమర్చారు. మాదారం ఫారెస్టు బీట్ అధికారి సఫియా బేగం నిందితులను అదుపులోకి తీసుకుని వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి విచారణ చేసి సదరు నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. ఈమేరకు నిందితులను ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు డెప్యూటీ రేంజ్ అధికారి పేర్కొన్నారు.



విధుల్లో ఉంటే క్లిక్ మనిపించాల్సిందే!

రోజు వారి విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎక్కడున్నా, ఏం డ్యూటీ చేస్తున్నారనేది సంబంధిత స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలనే ఆదేశాలున్నాయి. ఈ మేరకు ఫొటో ద్వారా సమాచారం అందించాలి. ఈమేరకు బుధవారం ఇంటర్ పరీక్షల బందోబస్తుకు హాజరైన పోలీసులు ఇలా ఫొటో దిగుతూ కనిపించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్